

ఓం

# గురువాణి

9 ఏప్రిల్, 2026    సంచిక-256



## మోహక్షయమే మోక్ష ప్రాప్తికి మార్గం

మోక్షం కావాలి, మోక్షం కావాలి అని చాలామంది ఆరాటపడుతూ ఉంటారు. గురువులను కూడా మోక్షం కావాలి అని అడుగుతూ ఉంటారు. ఐహిక జీవితంలో లోభము మరియు మోహము అనే రెండు దుర్గుణాలు త్రాచు పాముకు ఉండే రెండు కోరల మాదిరిగా విషంతో నిండి ఉన్నాయి, వాటిని త్రుంచి వేయాలి,అప్పుడే ప్రపంచంలో అందరూ సుఖ శాంతులతో జీవనం సాగించడానికి సాధ్యమవుతుంది.. నాది, నా వాళ్ళు అనే మోహంలో పడిపోయి ఉన్నారు నేటి మానవులు. ఈ డబ్బంతా నాదే అని అనుకుంటున్నారు మానవులు. ధనం ఒక వేశ్య లాంటిది అని అంటారు పెద్దలు.

ఉదాహరణకు ఒక నూరు రూపాయలు నోటు మీ దగ్గర ఉందనుకోండి, ఒక వారం రోజుల్లో ఆ నోటు చేతులు మారుతూ హైదరాబాదు, ఢిల్లీ లేదా కలకత్తాకు చేరుతుంది.

అలా ఆ నూరు రూపాయల నోటు ఎంతో మంది చేతులు మారుతుంది, ఎన్నో ఇళ్ళు తిరుగుతుంది. ధనాన్ని అలా సరఫరా చేస్తూ ఉండాలి, అలాగే ఆ ధనం మీద ఉండే మోహాన్ని ఖండిస్తూ పోవాలి. అందువల్ల మోక్షం కావాలి అంటే ఏమి చేయాలి? మోహక్షయమే మోక్ష ప్రాప్తికి మార్గం అంటారు. మోహాన్ని నాశనం చేసుకుంటే ఆటోమేటిగ్గా మోక్షం లభిస్తుంది అని అంటారు. కావున మోక్షానికి ప్రతిబంధకం ఏది అంటే మీలో ఉండే మోహమే. కాబట్టి శిష్య భక్తాదులారా మీలో ఉన్నటువంటి ధనం మీద మోహం, పిల్లల మీద మోహం, ఆస్తి అంతస్తులు మీద ఉన్నటువంటి మోహాన్ని వదిలి మోక్ష ప్రాప్తికి మార్గం సుగమం చేసుకోగలరని ఆశిస్తూ, ఆశీర్వదిస్తున్నాను.

